## క్లుప్తంగా

### ఆయుర్వేద వైద్యురాలిగా డి.ప్రమీల



**పిట్టలవానిపాలెం:** ఖాజీపాలెం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వైద్యులు డాక్టర్ సిద్దార్థ కర్లపాలెం మండలం పేరలి ఆయుర్వేద వైద్యశాలకు బదిలీ అయ్యారు. గుంటూరు జిల్లా మున్నంగి ఆయుర్వేద వైద్యశాల వైద్యురాలు డి.ప్రమీల ఖాజీపాలెం ఆయుర్వేద వైద్యశాల వైద్యురాలిగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రతి రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యశాలలో రోగులు వైద్యసేవలు పొందవచ్చని తెలిపారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**చుండూరు(వేమూరు):** విద్యుత్ మరమ్మతులు నిమిత్తం శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ అర్జునరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని నడిగడ్డపాలెం, వేటపాలెం, తోటపాలెం, కొత్తపల్లి, నార్కెలాపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

### దోమల నివారణతో ఆరోగ్యం పదిలం

**కొల్లూరు :** దోమల నివారణతో ప్రతి ఒక్కరి ఆరోగ్యం పదిలంగా ఉంటుందని అసిస్టెంట్ మలేరియా అధికారి వి.పున్నారెడ్డి అన్నారు. శుక్రవారం మలేరియ మాసోత్సవం ముగింపు సందర్భంగా ఆవులవారిపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాకాలం నేపథ్యంలో పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ కె.సుబ్బారెడ్డి, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.

### పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి

**రేపల్లె:** పెంచిన విద్యుత్ చార్జీలను ప్రభుత్వం తగ్గించాలని సీపీఎం పట్టణ అధ్యక్షుడు మణిలాల్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం వామపక్షపార్టీల ఆధ్వర్యంలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గురువారం నిరసన తెలిపారు. మణిలాల్ మాట్లాడుతూ విద్యుత్ ధరల పెంపుతో పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి బాలాజీ, నాయకులు పి.నాగాంజనేయులు, జి.దానియేలు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

### త్వరగా ఆచూకి కనుక్కోండయ్యా..!

**రేపల్లె రూరల్:** అదృశ్యమైన తన కుమార్తె త్వరగా కనిపెట్టాలని మైనేనివారిపాలేనికి చెందిన ఉయ్యూరు రాణి శుక్రవారం డీఎస్పీ మురళీకృష్ణను ఆశ్రయించింది. తమ కుమార్తె ఉయ్యూరు జ్యోతికి అదే గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌కు నాలుగేళ్ల క్రితం వివాహమైందన్నారు. జూన్ 27 నుంచి జ్యోతి కనిపించటం లేదని అల్లుడు చంద్రశేఖర్‌పై అనుమానం వ్యక్తం చేసింది. కేసును త్వరితగతిన విచారించి న్యాయం చేయాలని కోరింది. స్పందించిన డీఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ జ్యోతి అదృశ్యమైనట్లు ఇప్పటికే కేసు నమోదు చేశారని, దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. కేసును అన్ని కోణాల నుంచి విచారించి న్యాయం చేస్తామన్నారు.

### అంకిత భావంతో విధులు నిర్వహించాలి

**కర్లపాలెం:** అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ మంచి పేరు తెచ్చుకోవాలని తహసీల్దార్ కేశవనారాయణరావు తెలిపారు. కర్లపాలెం వీఆర్వోగా విధులు నిర్వహిస్తూ కలెక్టర్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ పొంది, బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళుతున్న చిలకా చంద్రశేఖర్‌ను శుక్రవారం మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ కేశవనారాయణరావు, కార్యాలయం సిబ్బంది, వీఆర్వోలు ఘనంగా సన్మానం చేశారు. సన్మానం చేసిన వారిలో డెప్యూటీ తహసీల్దార్ షలీమా, ఆర్ఐ శ్రీనివాసరావు, వీఆర్వోలు రమేష్‌రెడ్డి, ఆంజనేయులు యశ్వంతి, సుభానీ, నాగాంజనేయులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

### నితిన్ మృతదేహానికి మంత్రి నివాళి

**కోళ్లపాలెం(భట్టిప్రోలు):** ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌కు గురై గురువారం రేపల్లెలో మృతి చెందిన భట్టిప్రోలు మండలం పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని కోళ్లపాలెం యువకుడు కొమరాబత్తుని నితిన్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని రాష్ట్ర సాంఘిక శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున అన్నారు. శుక్రవారం ఆయన కోళ్లపాలెం విచ్చేసి నితిన్ మృతదేహానికి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి నాగార్జున మాట్లాడుతూ విద్యుత్ శాఖ తరఫున ఇప్పటికే రూ. 5 లక్షలు ప్రకటించడం జరిగిందని, అదనంగా ఆ శాఖ తరఫున ఎక్స్‌గ్రేషియా అందేలా అధికారులతో మాట్లాడనున్నట్లు తెలిపారు. తహసీల్దార్ డి. వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు నీలా నాగరాజు, నీలా రమేష్, మందపాటి బాబురావు తదితరులు ఉన్నారు.

# సంక్షేమ పథకాలు..పేదలకు వరాలు

**రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున**



ఈపూరు బీసీ కాలనీలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

**కొల్లూరు :** ప్రజల సంక్షేమమే పరమావధిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేద, బడుగు, బలహీన వర్గాలను వరాలుగా మారాయని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. శుక్రవారం మండలంలోని ఈపూరులో నిర్వహించిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ఆయన నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల రూపంలో చేకూరిని లబ్ధిని వివరించారు. కరపత్రాలను వారికి అందజేశారు. సంక్షేమ పథకాల లబ్ధి పొందిన వారు మంత్రి వద్ద ఆనందం వ్యక్తం చేశారు. ప్రజల స్పందనపై మంత్రి మాట్లాడుతూ.. కుల, మత, రాజకీయాలకు అతీతంగా నిష్పక్షపాతంతో అవినీతికి ఆస్కారం లేకుండా బడుగు, బలహీన వర్గాల ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందజేస్తుందన్నారు. స్థానికులు పలువురు నివేశన స్థలాలు మంజూరు కాలేదని మంత్రి నాగార్జున దృష్టికి తీసుకురావడంతో అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం స్థానికంగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీపై పశుగ్రాసం విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చొప్పర సుబ్బారావు, వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, సర్పంచ్‌లు మంచాల వసుంధర, సనక వెంకట్రావు, గొల్లపూడి వెంకటసుబ్బారావు, ఎంపీటీసీలు పడమట వెంకటలక్ష్మి, అమిరిశెట్టి శ్రీధర్, ఇంటూరి ప్రవీణ్, బావిరెడ్డి వెంకట్రామయ్య, వేమూరు మార్కెట్ యార్డు చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, గాజుల్లంక సొసైటీ బ్యాంక్ చైర్మన్ తూము నాగేశ్వరరావు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి అయిల సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## 'జగనన్న సహకార విద్యాజ్యోతి' వినియోగించుకోవాలి

**బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి**



జగనన్న సహకార విద్యాజ్యోతి కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

**బాపట్ల:** ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సహకార విద్యాజ్యోతి పథకాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ఆధ్వర్యంలో జగనన్న సహకార విద్యాజ్యోతి పథకం కరపత్రాలను ఎమ్మెల్యే కోన రఘుపతి శుక్రవారం ఆయన నివాసంలో ఆవిష్కరించారు. విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషిని అభినందించారు. ఉన్నతచదువులు చదువుకునేందుకు సాయాన్ని అందించేందుకు సహకార సంఘాలను కూడా రంగంలోకి దించటం వలన సకాలంలో రుణాలు అందేందుకు అవకాశం ఉందని చెప్పారు.చదువుకునేందుకు రూ.50లక్షలు కూడా రుణాలు ఇచ్చేందుకు పథకం ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలోసహకార బ్యాంకు మేనేజర్ కె.హరిత, పీఏసీఎస్ చైర్మన్లు పీటా వెంకటేశ్వరరావు, కోకి బ్రహ్మారెడ్డి, కళ్ళం జయరామిరెడ్డి, యర్రాకుల సుబ్బారావు, యర్రా రవీంద్రబాబు, ఆట్ల రామచంద్రారెడ్డి, మరకా పెద్ద వెంకటేశ్వర్లు, మున్నం గంగాధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ కట్టా మంగ

**రేపల్లె:** పట్టణంలో జరిగే అభివృద్ధిలో ప్రజా ప్రతినిధులు, అధికారులతో పాటు ప్రజలు భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అన్నారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో గురువారం మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించి చైర్‌పర్సన్ కట్టా మంగా మాట్లాడుతూ.. ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు సహకారంతో పట్టణంలో పలు అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పుర ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామన్నారు. స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని, తమ ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థ పదార్థాలను పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలని చెప్పారు. అనంతరం ఏజెండాలోని 14 అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్ కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథ గుప్త, కమిషనర్ విజయసారథి, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## చుండూరుపల్లి దళితులపై దాడి కేసులో నిందితుల అరెస్ట్

**వివరాలు వెల్లడించిన బాపట్ల డీఎస్పీ టి. వెంకటేశులు**



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశులు

**బాపట్లటౌన్:** పొలం సాగుచేసుకునే విషయంలో తలెత్తిన వివాదంలో దళిత దంపతులపై దాడిచేసిన కేసులో నిందితులను శుక్రవారం బాపట్ల పోలీసులు అరెస్ట్‌చేశారు. వివరాలను డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ టి. వెంకటేశులు వివరించారు. చుండూరుపల్లి గ్రామానికి చెందిన జాష్టి నాగవంశీకృష్ణకు ఈతేరు గ్రామ రెవెన్యూ పరిధిలో 4.53 ఎకరాల పొలం ఉంది. ఆ పొలాన్ని అదే గ్రామానికి చెందిన మెరుగుమోలు సతీష్‌కు కౌలు ఇచ్చారు. సతీష్ పొలాన్ని సాగుచేస్తుండగా నాగవంశీకృష్ణ సోదరుడు జాష్టి అంకమ్మచౌదరి, తన కుటుంబసభ్యులతో కలిసి నీవు ఎవడ్రా పొలం సాగుచేయటానికి అంటూ ఇష్టమొచ్చిన రీతిలో దళితుడైన సతీష్, అతనిభార్య రాహేలును కులంపేరుతో దూషించడమే కాకుండా కత్తులతో జూన్ 22న దాడిచేశారు. కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేయగా ఈ దాడిలో చుండూరుపల్లి గ్రామానికిచెందిన జాష్టి అంకమ్మ చౌదరి, జాష్టి నాగదినేష్, జాష్టి సుజాత, జాష్టి నాగమణిలతోపాటు పొన్నూరు మండలం, కసుకర్రు పంచాయతీపరిధిలోని వలసమాలపల్లి గ్రామానికిచెందిన కొచ్చెర్ల బెనర్జీ ఉన్నట్లు గుర్తించి వారిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచామన్నారు. విలేకరుల సమావేశంలో రూరల్ సీఐ వేణుగోపాలరెడ్డి, ఎస్ఐ కె. వెంకటప్రసాద్‌లు ఉన్నారు.

# జగనన్న సురక్ష పథకంతో మేలు



పట్టణంలోని 4వ వార్డులో కౌన్సిలర్ నాగలక్ష్మి బృందం సభ్యుల సర్వే

**ఐలవరం(భట్టిప్రోలు):** జగనన్న సురక్ష పథకం పేద ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని మండల ప్రత్యేక అధికారి డాక్టర్ ఎం. హనుమంతరావు పేర్కొన్నారు. శుక్రవారం ఐలవరం–1 సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు మురుగుడు శ్రీనివాసరావు, ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు, తహసీల్దార్ డి. వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ మాచర్ల హేమసుందరరావు పాల్గొన్నారు. ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు కోనేటిపురంలో జగనన్న సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. జేసీఎస్ కన్వీనర్ గోవర్ధనగిరి శేషాచల శ్రీనివాసరావు(చినబుజ్జి), సర్పంచ్ మోర్ల వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ మల్లోలు ఉషారాణి, తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ పరిశుద్ధరావు తదితరులు పాల్గొన్నారు.

**'జగనన్న సురక్ష'పై అవగాహన**

**పెనుమర్రు(వేమూరు):** మండలంలోని పెనుమర్రు గ్రామ సచివాలయంలో గురువారం జగనన్న సురక్షపై అవగాహన సదస్సు నిర్వహించారు. జూలై 1 నుంచి జగనన్న సురక్షపై గ్రామ సభ నిర్వహించడం జరుగుతుందని మండల ప్రత్యేకాధికారి విజయ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరరావు, గ్రామ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

**వేగంగా 'జగనన్న సురక్ష' సర్వే**

**చెరుకుపల్లి:** అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలు పొందాలనే ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బాపట్ల జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చీరాల ప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని రాంబోట్లపాలెం గ్రామంలో జరుగుతున్న జగనన్న సురక్ష సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు, అనంతరం వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో ఇంటింటికి వెళ్లి సర్వే చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయానంద్, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ బి.విజయ్‌కుమార్, వీఆర్వో నరసింహరాజు.

**సేవలను సద్వినియోగం చేసుకోవాలి**

**బాపట్ల అర్బన్:** జగనన్న సురక్ష సేవలను ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని ఎంపీడీవో ఎ.రాధాకృష్ణ తెలిపారు. మండలంలోని ఈతేరు, పూండ్ల సచివాలయాల పరిధిలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. పూండ్ల సచివాలయం వద్ద బాపట్ల తహసీల్దార్, ఈఓపీఆర్డీ, ఈతేరు సచివాలయం వద్ద ఎంపీడీఓ, డిప్యూటీ తహసీల్దార్ సర్వేను పరిశీలించారు. పూండ్ల సచివాలయం పరిధిలో 612, ఈతేరు సచివాలయం పరిధిలో 393 మంది సర్టిఫికెట్‌లకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు.

**ప్రారంభమైన జగనన్న సురక్ష కార్యక్రమం**

**రేపల్లె రూరల్:** జగనన్న సురక్ష కార్యక్రమం శుక్రవారం పట్టణ, రూరల్‌ల్ ప్రాంతాల్లో ప్రారంభమైంది. ప్రజా ప్రతినిధులు, సచివాలయ, మున్సిపల్, రెవెన్యూ అధికారులతో కూడిన జగనన్న సురక్ష బృందం సభ్యులు ఇంటింటికి తిరిగి, ప్రజల సమస్యలు తెలుసుకుని, వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కైతేపల్లిలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మండలి అంజయ్య బృందం సభ్యులు, 4వ వార్డులో కౌన్సిలర్ నాగలక్ష్మి బృందం సభ్యులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఆధార్‌కార్డు అప్‌డేట్‌తో పాటు జనన, మరణ, కుల ధృవీకరణ పత్రాలు, రేషన్‌కార్డులకు ఎక్కువగా దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలుపుతున్నారు.

### రెండు ఎకరాల వరిగడ్డి వామి దగ్ధం

**కర్లపాలెం:** వరిగడ్డి వామి దగ్ధమైన ఘటన శుక్రవారం ఎంవిరాజుపాలెంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కర్లపాలెం పంచాయతీ ఎంవిరాజుపాలెం గ్రామానికి చెందిన ఆట్ల గోపిరెడ్డికి చెందిన రెండు ఎకరాలలోని వరిగడ్డి వామి శుక్రవారం మధ్యాహ్నం మంటలు ఎగసి దగ్ధమైంది. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదని ఆస్తి నష్టం రూ.25వేల వరకు ఉంటుందని స్థానికులు తెలిపారు.

### విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి

**బాపట్లటౌన్:** విద్యుత్‌షాక్ తగిలి వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం మండలంలోని పూండ్ల గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే కర్లపాలెం మండల కేంద్రానికి చెందిన మచ్చా వెంకటేశ్వర్లు బాపట్ల మండలం, పూండ్ల గ్రామంలో చెట్లు నరికేందుకు కూలి పనులకు వెళ్ళాడు. చెట్లు నరుకుతుండగా ప్రమాదవశాత్తు చెట్టు కొమ్మలు విద్యుత్ తీగలపై పడి షాక్ తగిలింది. ఈ ఘటనలో అక్కడికక్కడే మృతిచెందారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ కె. వెంకటప్రసాద్ కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### అద్దేపల్లిలో పౌరహక్కుల దినోత్సవం

**భట్టిప్రోలు:** అద్దేపల్లిలో తహసీల్దార్ డి. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. సామాజిక పరమైనటువంటి సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. వీఆర్వో అంబటి ప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయండి

**బాపట్ల అర్బన్ :** బాపట్లలో జులై 19న గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. సీఐటీయూ కార్యాలయం శుక్రవారం జరిగిన గ్రామ పంచాయతీ వర్కర్స్ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీ వర్కర్స్ రాష్ట్ర మహా సభలు నూతన జిల్లా బాపట్లలో జరుగుతున్నాయని, కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు సహకరించి, జయప్రదం చేయాలని కోరారు. గ్రామ పంచాయతీ వర్కర్స్ సమస్యలపై రాష్ట్ర మహా సభల్లో చర్చించడం జరుగుతుందన్నారు. ఆగస్టు 4న రాష్ట్రంలో గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌ల ముట్టడి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ మజుందార్, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరావు, పంచాయతీ యూనియన్ నాయకులు సురేష్ , పోతురాజు, బ్రహ్మయ్య సామ్రాజ్యం పాల్గొన్నారు.


## శ్మశాన వాటిక స్థల సమస్యకు పరిష్కారం



శ్మశానికి హద్దులు వేస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వరరావు

**పెదపాలెం(భట్టిప్రోలు):** పెదపులివర్రు పంచాయతీ పరిధిలోని పెదపాలెంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో శ్మశానవాటిక లేకపోడంతో రహదారుల వెంటే ఖననం చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని గ్రామస్తులు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు గ్రామంలో ఎకరా స్థలంలో శ్మశాన వాటిక ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని గుర్తించి, శుక్రవారం హద్దులు కేటాయించారు. మండల సర్వేయర్ బొర్రా శ్రీనివాసరావు, వీఆర్వో వెంకటేశ్వరరావు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

## బాపట్ల అర్బన్ బ్యాంకు చైర్మన్ సత్యనారాయణ మృతి



నివాళి అర్పిస్తున్న బ్యాంకు వైస్ చైర్మన్ నరాలశెట్టి ప్రకాశరరావు

**బాపట్ల:** బాపట్ల అర్బన్ బ్యాంకు చైర్మన్ కొల్లిమర్ల సత్యనారాయణ(80)శుక్రవారం మృతి చెందారు. సీనియర్ న్యాయవాదిగా ఉన్న సత్యనారాయణ బ్యాంకు చైర్మన్‌గా పని చేస్తున్నారు. శుక్రవారం బ్యాంకు వైస్ చైర్మన్ నరాలశెట్టి ప్రకాశరరావు ఆధ్వర్యంలో బ్యాంకు పాలకవర్గం సంతాపం తెలియజేసింది. బ్యాంకు అభివృద్ధికి కొల్లిమర్ల చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ సంతాప సభలో అర్బన్ బ్యాంక్ మేనేజర్ గోపాల్, డైరెక్టర్స్ బొమ్మశెట్టి హరినాథ్ మురళి, ఇనప గొల్ల రంగారావు, గర్నేపూడి వెంకటేశ్వరరావు, జోగి ఆనంద్, నగేష్, బూరుగుల సంగమేశ్వర శాస్త్రి, అర్బన్ బ్యాంక్ సిబ్బంది ఉన్నారు.

## ఆంగ్ల భాషపై పట్టు సాధిస్తే ఉజ్వల భవిష్యత్తు

**పిట్టలవానిపాలెం:** ఖాజీపాలెం డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో అతిథి ఉపన్యాస కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. దర్శి ప్రభుత్వ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ ఎ.నగేష్ ఆంగ్ల భాష ప్రాధాన్యంతను వివరించారు. భాషపై పట్టు సాధనకు అవసరమైన సూత్రాలను వివరించారు. కళాశాల జాయింట్ సెక్రటరీ మంతెన కృష్ణంరాజు మాట్లాడుతూ ఆంగ్ల భాషలో ప్రావీణ్యం సంపాదిస్తే.. విద్యార్థికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా నగేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు

**ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు**



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎంపీ మోపిదేవి

**చెరుకుపల్లి:** అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను మరలా ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. మండలం కేంద్రంలో మూడో రోజు ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ఏ కుటుంబానికి ఎంత మేర లబ్ధి చేకూరిందో బ్రోచర్ అందించి వివరించారు. నాలుగు సంవత్సరాల్లో ఒక్క చెరుకుపల్లి గ్రామానికే 18,111మంది లబ్ధిదారులకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఇప్పటి వరకూ రూ.35.25 కోట్ల లబ్ధి చేకూరిందని తెలిపారు. గ్రామంలోని ఆదర్శకాలనీలో రోడ్ల పరిస్థితిని, మంచినీటి, మురుగు సమస్యను ఎంపీ మోపిదేవికి దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే సంబధిత అధికారులను పిలిపించి, తాగునీటి సమస్య త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. రోడ్లు సాధ్యమైనంత త్వరగా వేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ పైనం ఏడుకొండలురెడ్డి, నాయకులు చీరాల ప్రసాద్‌రెడ్డి, బండారు రామారావు, కామినేని కోటేశ్వరరావు, చెన్ను కోటేశ్వరరావు, ఎల్లెల రవికిరణ్, పంచుమర్తి చిన వెంకటసుబ్బారావు, సర్పంచ్ దేవరకొండ వాణి, ఎంపీటీసీ నాగుల నరసింహారావు, బర్మా కృష్ణమూర్తి, నందిపాటి సుబ్బారావు, దత్తు మురళి, సోమరౌతు సుబ్బారావు, ఎంపీడీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బత్తుల పద్మావతి

**బాపట్ల:** బాలల హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి పేర్కొన్నారు. బాపట్ల కలెక్టరేట్ లోని స్పందన హాల్లో ఎలిమినేషన్ ఆఫ్ చైల్డ్ లేబర్ క్యాంపెయిన్ ముగింపు సమావేశం శుక్రవారం జరిగింది . ఈ సమావేశంలో పద్మావతి మాట్లాడుతూ 14 సంవత్సరాలలోపు పిల్లలను ఎవరైనా పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. సీడబ్ల్యూసీ సభ్యురాలు నీలిమా, డిప్యూటీ లేబర్ కమిషనర్ శివప్రసాద్, సోషల్ వెల్ఫేర్ డీడీ దేబోరా, బాపట్ల లేబర్ ఆఫీసర్ సాయి జ్యోతి, అద్దంకి, చీరాల లేబర్ ఆఫీసర్ చంద్రశేఖర్, సిఫార్డు స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు

**ఎమ్మెల్యే కోన రఘుపతి**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

**బాపట్ల:** ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందించేందుకు కృషి జరుగుతోందని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు.ఎమ్మెల్యే కోన నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన రోజు నుంచే సంక్షేమం ఒకవైపు..అభివృద్ధి మరోవైపు పరుగుతీయిస్తున్నారని తెలిపారు. మ్యానిఫెస్టోని దైవంగా భావించి ఇచ్చిన హామీలు 90శాతం పూర్తి చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని పేర్కొన్నారు. తాజాగా జగనన్న సురక్ష అనే నూతన పథకానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఈ పథకం ద్వారా నెల రోజులపాటు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు ఇంటింటికి తిరిగి అర్హులై ఉండి ప్రభుత్వ పథకాలు పొందకుండా ఉన్నవారిన్ని గుర్తించి తక్షణమే పథకాలు అందించే విధంగా కృషి చేస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ పథకాలు పొందాలని ఆయన కోరారు.

**ఇసుక మాఫియా వాస్తవం కాదు**

బాపట్ల నియోజకవర్గం లో ఇసుక మాఫియా జరుగుతుందని కొందరు ప్రచారం చేయడం సరికాదని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. బాపట్ల నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు కొద్దిమేర ఇసుక ఉపయోగిస్తున్నారని తెలిపారు. రైతులు తమ భూమిలోని 4,5అడుగుల మేర ఇసుక తీసుకునేందుకు అనుమతి ఉందని తెలిపారు. ప్రస్తుతం చీరాల నియోజకవర్గం నుంచే ఇసుక బాపట్లకు వస్తోందని, అక్కడ రెవెన్యూవిభాగం ఇసుక తవ్వకాలపై నిబంధనలకు అనుగుణంగా అనుమతులు ఇచ్చారని తెలిపారు. కొంతమంది ఇసుక అక్రమాలు అంటూ ఇష్టమొచ్చినట్లు ప్రచారం చేయటం సరికాదన్నారు.బాపట్లలో సిమెంటు ఇసుకలేదని, ఉంది కేవలం మెరక ఇసుకమాత్రమేనని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కాగిత సుధీర్ బాబు,చేజర్ల నారాయణరెడ్డి, కొర్రా ఏడుకొండలు, సయ్యద్ హుస్సేన్,ఇనగలూరి మాల్యాద్రి, జోగి రాజా,మోర్ల సముద్రాల గౌడ్,జాలిరెడ్డి ఉన్నారు.







